చీరలు, దుప్పట్ల పంపిణీ

చీరలు పంపిణీ చేస్తున్న సంస్థ చైర్మన్ పట్టాసి దీప్తి

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు పంచాయతీలో అడారి,దడవలస గ్రామాల్లో మంగళవారం ట్రైబల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 36 మంది వృద్ధులకు, వితంతులకు చీరలు,దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ పట్టాసి దీప్తి మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో పేద కుటుంబాల కష్టాలను గుర్తించి తమ సంస్థ తరపున అవసరమైన సాయాన్ని అందిస్తున్నామన్నారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ కిల్లో అప్పలస్వామి, బికారి,విలేజ్ కోఆర్డినేటర్లు కిల్లో మూర్తి, స్వాబి మంగళయ్య, బోరిబోరి సింహాద్రి, జన్ని కామరాజు, రాజు, చినబాబు పాల్గొన్నారు.

గొంతెండుతున్నా.. పట్టించుకోరా?

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స
- పలుచోట్ల ఖాళీ బిందెలతో గిరిజనుల నిరసన
- ప్రజా చైతన్యయాత్రలో ఊరూరా సమస్యల ఏకరువు
- గ్రామ సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేత

దుంబ్రిగుడలో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: వేసవికి ముందే తాగునీరు లేక గిరిజన గ్రామాల్లో ప్రజల గొంతెండి అల్లాడిపోతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మండిపడ్డారు. మంగళవారం సిపెం ప్రజాచైతన్యయాత్రలో భాగంగామండలంలోని కితలంగి పంచాయతీ మారుమూల గ్రామమైన గాంధలో పర్యటించారు. అక్కడి ప్రజలు సమస్యలను అడిగితెలుసుకున్నారు. తీవ్రమైన తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్న గాంధ గిరిజనులు ఖాళీబిందెలతో రోడ్డుపైనే ఆందోళన చేపట్టారు.

ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ గాంధ గ్రామంలో 70 కుటుంబాలకు చెందిన 350 మంది నివాసముంటున్నారని, అయితే తాగునీరు లేక అల్లాడిపోతున్నా రన్నారు. అర్థాంతరంగా ఆగిన రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని కోరారు. గాంధలోని సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి.పోతురాజు, నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

అరకు లోయ/ రూరల్ : మండలంలోని నువ్వులగూడ, లింబగూడలో తాతలనాటి నుంచి సాగులో ఉన్న 35మంది రైతుల భూములకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా నేతలు పొద్దు బాలదేవ్, కిల్లో జగన్నాధం కోరారు. మంగళవారం ప్రజాచైతన్యయాత్రలో భాగంగా సిపిఎం నేతల బృందం ఆయా గ్రామాలను పర్యటించి, స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరాలుగా సాగులో ఉండడంతోపాటు 1970 సెటిల్‌మెంట్ పత్రాలుండడంతోపాటు రెండుసార్లు సర్వే చేసినా గిరిజనులకు పట్టాలు ఇవ్వడం లేదన్నారు. పెదలబుడులో వందమంది ఆదివాసీ రైతులకు చెందిన 250 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే కర్ణగడ్డ చెక్‌డ్యామ్ మట్టితో పూడుకుపోయి, రక్షణగోడ కోతకు గురైందని, తక్షణమే నీటిపారుదల శాఖ, గ్రామీణా ఉపాధి హామీ అధికారులు స్పందించి రక్షణగోడ ఎత్తుపెంచి, పూడికతీత పనులు చేపట్టి సాగునీటిని అందించే చర్యలు చేటప్టాలన్నారు. ఆయా సమస్యలపై పెదలబుడు-1 సచివాలయం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు హరి, పెదలబుడు ఆయకట్టు సంఘం నాయకులు సద్దు నాయుడు, ప్రసాద్, రాజారావు, నువ్వగుడ లింబగుడ గ్రామస్తులు పాల్గొన్నారు

సమస్యలపై సచివాలయాల్లో వినతి

అరకురూరల్ : మండలంలోని చొంపి, సిరగాం, బొండం, మాడగడ, పెదలబుడు, పద్మాపురం, సుంకరమెట్ట పంచాయతీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సిపిఎం అధ్వర్యంలో పలు సచివాలయాల్లో అధికారులను వినతి పత్రాలను అందజేసారు. చొంపి పంచాయతీ చొంపి, కొత్తవలస, మర్రివలస గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. కొత్తవలసలో బోరు తవ్వినా, ట్యాంక్ పనులు మధ్యలో ఆపేయడం తాగునీరు అందని స్థితి ఉందన్నారు మాడగడ పంచాయతీ జాకరవలస,మెచ్చగూడ గ్రామాలకు రోడ్డు, తాగు నీరు సమస్యలు పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు ఆధ్వర్యంలో సుమారు రెండున్నర కిలో మీటర్ల వరకు ఖాలిబిందెలతో పాదయాత్ర చేసి మాడగడ సచివాలయం 2 వద్ద నిరసన వ్యక్తం చేశారు. రంపుడువలసలో జల్ జీవన్ మిషన్ ద్వారా వేసిన బోరు తవ్వి, పాతట్యాంకు ద్వారా కుళాయిలకు కనెక్షన్లు, వాటికి ట్యాప్‌లు వేయకుండా నిర్లక్ష్యంగా నీటిని సరఫరా చేస్తున్నారని విన్నవించారు. పద్మపురం పంచాయతి దుమ్ముగూడ, దుమ్ముగుడ కాలనీ,శారదబొందగుడ,ఎండపల్లివలస, పద్మాపురం గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని అధికారులు వెంటనే పరిష్కరించాలని ఉప సర్పంచ్ జన్ని భగత్ రామ్ డిమాండ్ చేశారు. బొండం పంచాయతీలో పిఎం జన్‌మన్ ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని సిపిఎం మండల నాయకులు గత్తుం బుజ్జిబాబు కోరారు. 2.0 హౌసింగ్ సర్వే గడువు ముగుస్తుండడంతో లబ్ధిదారులు అందోళన చెందుతున్నారు. బొండం గ్రామ సచివాలయం నుండి కొత్తవలస వరకు ఫారెస్ట్ అధికారులు అభ్యంతరాలతో నిలిసిపోయిన రోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు .కొత్తవలస, రేగా, కొలియగూడ, రంగినిగుడ, రంపుడువలస, కరకవలస, గ్రామాలల్లో చెక్ డ్యాములు నిర్మించి సాగునీరు అందించాలన్నారు. జాకరవలస మెస్సాగూడ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక డోలిమోతలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిఎ జన్‌మన్ ఇళ్లకు ముడిసరుకు తీసుకెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక పనులు సాగడం లేదన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పాడి రవి, సీసా కమిటీ ఉపాధ్యక్షులు కిలో మహేష్, కె.ధర్మ, సిపిఎం మండల నాయకులు కె బుజ్జిబాబు, నాయకులు గొల్లోరి డొంబు, గ్రామ స్తులు ఎస్ చైతన్య, గొల్లోరి, దెబో, కె గోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించే వరకు పోరాటం

కాలినడకన వెళుతున్న జెడ్‌పిటిసి గంగరాజు, సిపిఎం బృందం

అనంతగిరి: మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించే వరకు పోరాటం చేస్తామని స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు అన్నారు మంగళవారం మారుమూల పినకోట పంచాయతీ పట్టబూడి. సిందుగలపాడు. గ్రామాలలో సిపిఎం ప్రజాచైతన్యయాత్ర నిర్వహించి, సమస్యలపై గిరిజనులతో అడిగి తెలుసుకున్నారు. కాలినడకన ఆయా గ్రామాలకు వెళ్లిన సిపిఎం బృందానికి స్థానికులు రోడ్డు, తాగునీరు, ఇతర సమస్యలతో స్వాగతం పలికారు

ఈసందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, ఆయా గ్రామాలకు రూ.16.67 కోట్లతో 16 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా అటవీశాఖ అభ్యంతరంతో పనులు జరగలేదని, అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించి రోడ్డు పనులు వెంటనే చేపట్టాలన్నారు. రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాలు లేకుండా చేస్తానని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించి, మూడునెలలుగా గడిచినా అ దిశలో అధికారుల చర్యలు కనిపించడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎన్. చినగంగులు. ఎస్ రాజు. ఎన్ సురేష్. రాజారావు లక్ష్మణారావు తదితరులు పాల్గొన్నారు

పిఎం జన్‌మన్ ఇళ్లకు రెండో విడత బిల్లులు చెల్లించాలి

ముంచింగిపుట్టు : పిఎం జన్‌మన్ఇళ్లకు రెండో విడత బిల్లులు చెల్లించి లింటెల్ దశలో నిలిచిపోయిన నిర్మాణాలుముందుకు సాగేలా సహకరించాలని సిపిఎం నేతలు కోరారు. మంగళవారం మండలంలోని కించాయిపుట్టి పంచాయతీ వర్కుగుమ్మి గ్రామంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్రా త్రినాథ్, మండల కమిటీ సభ్యుడు ఎంఎం శ్రీను ఆధ్వర్యంలో ప్రజాచైతన్యయాత్ర నిర్వహించి, ఆదివాసీ గిరిజనులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్కుగుమ్మి గ్రామంలో పీఎం జన్ మన్ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించి సిసి రోడ్డు నిర్మాణంచేపట్టి ,ఇళ్ల నిర్మాణాలకు సహకరిం చాలని కోరారు. అర్హులకు సూపర్ సిక్స్ పథకాలను వర్తింప జేయాలని, కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. సమస్యలపై సంబంధిత సచివాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు. తక్షణమే స్పందించి, పరిష్కరించకుంటే తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజారావు, భాస్కరరావు, కామేష్ పాల్గొన్నారు.

నీటిఎద్దడిపై ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇల నిర్బంధం

చింతపల్లి: మేజర్ పంచాయతీ చింతపల్లిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్ ఆధ్వర్యంలో మండల పరిషత్ వద్ద స్థానిక మహిళలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. మంగళవారం సాయినగర్ వీధి నుండి హనుమాన్ కూడలి మీదుగా మండల పరిషత్ కార్యాలయం వరకు ఖాళీ బిందెలతో ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. నీటి ఎద్దడినివారించాలని స్థానిక ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యూఎస్ జెఇ స్వర్ణలతను కొద్దిసేపు నిర్బంధించారు. రెండేళ్లుగా మేజర్ పంచాయతీ చింతపల్లిలోని పలు వీధుల్లో తాగునీటి సమస్య నెలకొన్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయినగర్ వీధిలో కుళాయిల ద్వారా నీటిసరఫరా జరగడంలేదని, రెండు మూడురోజులకోసారి వచ్చే ట్యాంకరు నీటి అవసరాలను తీర్చలేకపోతోందని, నీటి కోసం నిరుపేద కూలీలు పనులు మానుకోవాల్సి వస్తోందని మండిపడ్డారు. బుడతలవేనం నుంచి అంతర్ల, చుంచుంపూడి, డైలీ నగర్ వరకు నీటి ఎద్దడి ఉందని వాపోయారు. తక్షణమే సమస్యను పరిష్కరించకుంటే, మండల కేంద్రంలో వంటావార్పు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సాగిన చిరంజీవి, స్థానిక నాయకులు కోటి, మహిళలు పాల్గొన్నారు.

26న చలో ఐటిడిఎను జయప్రదం చేయండి

విఆర్.పురం : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26వ తేదీన తలపెట్టిన చలో ఐటిడిఎ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల కమిటీ సభ్యులు కమ్మసిచ్చు సత్యనారాయణ పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలంలోని ములకనపల్లి పంచాయతీ పరిధి వీరపాపన కుంట, ములకనపల్లి, జల్లివారిగూడెం గ్రామాల్లో సిపిఎం నాయకులు మంగళవారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంచినీరు, రహదారులు,. వీరపాపనకుంట గ్రామంలో అంగన్వాడీ భవనం నిర్మించాలన్నారు. కుందులూరు మీదుగా పెదమట్టపల్లి వరకు ఉన్న బీటీ రొడ్డును గత ప్రభుత్వంలో రోడ్డు పునర్నిర్మాణం పేరుతో తవ్వి వదిలివేశారని, దానిని నిర్మించాలని కోరారు.

పెదలబుడులో వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

అరుకులోయలో సిపిఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో నిరసన

గంగరాజుకు సమస్యలను విన్నవిస్తున్న గిరిజనులు

చింతపల్లి మండల పరిషత్ వద్ద ఖాళీ బిందెలతో నిరసన

ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధిత డ్వాక్రా మహిళలు

బ్యాంకు రుణాల్లో అవకతవకలపై

డ్వాక్రా మహిళల ఆందోళన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

బ్యాంకు రుణాల్లో అవకతవకలపై స్థానిక వెలుగు కార్యాలయం వద్ద మహిళలు మంగళవారం ఆందోళన చేపట్టారు. మండలంలోని తంటికొండ పంచాయితీ వట్టిగెడ్డ గ్రామానికి చెందిన 15 డ్వాక్రా సంఘాలకు చెందిన సభ్యుల అనుమతులు, వారికి ఎటువంటి సమాచారం లేకుండానే రాజవొమ్మంగి యూనియన్ బ్యాంకు వారు రుణాలు మంజూరు చేసి వారి బ్యాంకు ఖాతాలో జమ చేసి, తిరిగి బ్యాంకు వారే తీసుకున్నట్లు వట్టిగెడ్డ గ్రామానికి చెందిన కావేరి, సంధ్య, వనిత, దివ్య, ప్రియదర్శిని, రమ్య, సాయి తదితర గ్రూపులకు చెందిన మహిళలు ఆరోపించారు. ఈ మేరకు ఈ గ్రూపులకు చెందిన సుమారు వందమంది డ్వాక్రా మహిళలు రాజవొమ్మంగి వెలుగు ఆఫీస్ వద్ద మంళవారం ఆందోళన చేపట్టారు. తమకు రుణాలు మంజూరైనట్లు గాని, డబ్బులు వేసినట్టుగాని, తీసినట్లు గాని ఎటువంటి విషయాలు తెలియదని, తమకు తెలియకుండా బ్యాంకులో లావాదేవీలు ఎలా జరిగాయంటూ ఏపిఎం రామాంజనేయులు, ఎంఎంఎస్ సభ్యులను నిలదీశారు. దీనికి స్పందించిన వెలుగు ఏపీఎం రామాంజనేయులు, ఎంఎంఎస్ లీడర్లు బుధవారం ఒట్టిగడ్డ గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను తెలుసుకుని చర్యలు చేపడతామని డ్వాక్రా మహిళలకు హామీ ఇచ్చారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో దూసరపాము ఎంపీటీసీ నల్ల సత్యనారాయణ, వట్టిగెడ్డ గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

జోరుగా హౌసింగ్ సర్వే

సర్వే చేస్తున్న సచివాలయ డిజిటల్ అసిస్టెంట్

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధిలో అధికారులు ఆదేశాలు మేరకు హౌసింగ్ సర్వే శరవేగంగా నిర్వహిస్తున్నామని సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ విజయ తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పంచాయతీ సర్పంచి పాంగి దుర్జో ఆధ్వర్యంలో చింతపల్లి క్యాంపు, లైకాన్‌పూర్, చంద్రుపల్లి, సీలేరులో హౌసింగ్ సర్వే నిర్వహించామని చెప్పారు. ఇప్పటివరకు 68 ఇళ్లు సర్వే పూర్తి చేశామని, మిగిలిన కుటుంబాలకు ఈనెల 25 నాటికి పూర్తి చేసి అధికారులకు నివేదికన అందజేస్తామని తెలిపారు.

విజయవాడ-రేఖపల్లి బస్సును పునరుద్ధరించాలి

వినతిపత్రం ఇస్తున్న ఎంవివి.రాజు

ప్రజాశక్తి-విఆర్.పురం

విజయవాడ నుండి కూనవరం, విఆర్.పురం మండలం రేఖపల్లి వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కూనవరం గ్రామానికి చెందిన ఎంవివి.రాజు మంగళవారం విజయవాడలో ఎపిఎస్ ఆర్టీసీ డిపిటిఓను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రంపచోడవరం ఎమ్మెల్యే రాసిన లేఖను అందజేశారు. విఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాల ప్రజలు రాష్ట్ర రాజధాని ప్రాంతం విజయవాడ, గుంటూరు వెళ్లి రావడానికి నేరుగా బస్సులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంత రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, ఇతర ప్రజలు భద్రాచలం వెళ్లి అక్కడ నుండి విజయవాడ బస్సులు ఎక్కవలసి వస్తోంది. ఈ సమస్య గురించి రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి దృష్టికి స్థానిక ప్రజలు, నాయకులు తీసుకెళ్లగా ఆమె స్పందించి విలీన మండలాలకు విజయవాడ నుండి కూనవరం రేఖపల్లి వరకు బస్సు సర్వీసు పునరుద్ధరించాలని విజయవాడ ఏపీఎస్ఆర్టీసీ డిపిటిఓకు లేఖ రాశారు. ఈ లేఖను ఎంవివి.రాజు మంగళవారం డిపిటిఓకు అందించారు. దీనికి స్పందించిన ఆయన వారం రోజులలో విజయవాడ నుండి కూనవరం రేఖపల్లి వరకు బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు రాజు తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్యాలయము - సుంకరమెట్ట

రేఖా నెం.02/2025 | **బహిరంగ వేలం మరియు టెండరు ప్రకటన** | తేదీ.11-03-2025

సుంకరమెట్ట గ్రామపంచాయితీకి చెందిన ఈ దిగువ వివరించిన 2025-26 సం॥రం॥నకు బహిరంగ వేలం తే: 20-03-2025దీ గురువారం ఉదయం 11.00 గం॥లకు గ్రామపంచాయితీ కార్యాలయము సుంకరమెట్ట నందు కార్యనిర్వహణాధికారి (పంచాయితీ కార్యదర్శి) వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని జరుపబడును.

వ.నెం	వేలం మరియు టెండరు ప్రకటన	సర్కారి వారి పాట	సాల్వెన్సీ	ధరావత్తు పైకము
1.	సుంకరమెట్ట గ్రామపంచాయితీకి పరిధిలో గల సుంకరమెట్ట గ్రామములో గల వారపు సంత వేలం గుత్తలు 2025-2026 సం॥రం.నకు	70,000/-	50,000/-	10000/-

(1). వేలం షరతులు 2025-26 సం.రం టెండర్లులో పాల్గొనదలచిన వారు షెడ్యులలో చూపబడిన వాటికి ఎదురుగా ధరావత్తు పైకము చెల్లించి సంబంధిత అధికారుల నుండి రశీదు పొంది టెండర్లు దాఖలు చేయవలెను. (2). ఈ గ్రామపంచాయితీకి ఏవిదమైన బకాయిదారులు గానీ ఇంటిపన్ను చెల్లించనివారు వేలంలో పాల్గొనరాదు. (3). ఈ గ్రామపంచాయితీకి సివిల్/ క్రిమినల్ / ఇ.డి. కేసులు వేయబడిన వారుగాని, ఈ గ్రామపంచాయితీ పై కేసులు దాఖలు చేసినవారు గాని టెండర్లులో పాల్గొనుటకు అనర్హులు. (4). స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిదులు (M.P.T.C, Z.P.T.C లు గ్రామపంచాయితీ వార్డు సభ్యులు, సర్పంచ్లు, MPP మొదలగువారు) గాని వారు కుటుంబసభ్యులు గాని వేలంలో పాల్గొనుటకు అనర్హులు. (5). వేలంలో ఎట్టి కారణముచుపిగాని, చూపకగాని వాయిదా వేయుటకు తిరస్కరించుటకు ఆమోదించుటకు గ్రామపంచాయితీ అధికారులకు పూర్తీ అధికారము కలదు. (6). గ్రామపంచాయితీ నోటిఫికేషన్ నందలి షరతులను వేలంలో పాల్గొనే పాటదార్లు విదిగా పాటించవలెను. వేలం ఖాయపడినవారు గ్రామపంచాయితీ ఆమోదము తదుపరి నాన్ జుడిషియల్ స్టాంపులపై అగ్రిమెంట్ వ్రాసి దాఖలు చేయవలెను భవిష్యత్తులో జరుగు ఎటువంటి పరిణామాలకు గ్రామపంచాయితీకి గాని సంబందిత అధికారులకు గాని ఎటువంటి సంబంధం లేదు. (7). గ్రామపంచాయితీలో ఇది వరకు వేలంలో ఎటువంటి బకాయిలు లేకుండా చెల్లించిన పాటదారులకు ప్రాధాన్యం. (8). 2025-26సం.రం వేలం పాటలో పాల్గొనదలచిన వారు షెడ్యులులో చూపబడిన వాటికి ఎదురుగా ధరావత్తు పైకము చెల్లించి, సంబందిత అధికారుల నుండి తే: 01.03.2025దీ॥ తరువాత జారీకాబడిన మోతుబరి దృవపత్రం దాఖలుచేసి పాటలో పాల్గొనవలేను. (9). బహిరంగ వేలం పాటలో హెచ్చు పాటదారు పాట ముగిసిన పిమ్మట సదరు ఐటంకు దాఖలు కాబడిన హెచ్చు పాట మొత్తం ఖరారు చేయబడును. (10). వ.నెం.1 సంబందించిన వేలం పాటలకు రూ.50,000/-లు విలువ గల సాల్వెన్సి ద్రువపత్రములు సంబందిత శ్రీ డివిజనల్ పంచాయితీ అధికారి, పాడేరు వారి నుండి సాల్వెన్సీ దృవపత్రము పొంది జతపరచవలేను. మిగిలిన 2,3వ వ.నెం. దానికి రూ.30,000/- లు విలువ గల సాల్వెన్సీ దృవపత్రం సంబందిత శ్రీ విస్తరణాధికారి (సం.రా. & ఆర్.డి) మండల పరిషత్ అరకువేలి వారి నుండి పొందవలెను. (11). వేలం పాటదారులు వేలం ఖాయపర్చిన తదుపరి నాన్ జుడిషియల్ స్టాంపులపై అగ్రిమెంట్ ఈ దిగువ సంతకం దారునకు దాఖలు చేయవలెను. స్టాంపులు దాఖలు చేసిన తదుపరి మీయొక్క పనులు ప్రారంభించవలెను. పై షరతులుకు అంగీకరిస్తూ వేలంలో పాల్గొనవలెను. యితర షరతులు వివరములు కార్యాలయము పనిచేయువేలలందు అడిగి తెలుసుకొనవలెను. (12). ఈ దాఖలైన టెండర్లను సుమారుగా రెండు సం,, లేక మూడు సం,, ములు అనుభవం పొంది ఉండవలెను లేనిచో వారు అనర్హులుగా గుర్తించబడుదురు.

సం/-పాలక రాజ్‌కుమార్ పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయితీ - సుంకరమెట్టు అరుకవేలి మండలం

ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ మరియు ఎక్స్ అఫీషియో జాయింటు కలక్టరు
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

నోటిఫికేషన్ తేది: 18-03-2025

శ్రీయుత జిల్లా కలెక్టర్ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు వారి Rc.No. 625/2022/DT-Admin/Dt.24-01-2025 అనుసరించి అల్లూరి సీతారామరాజు జిల్లా నందు గల ఆర్& ఆర్ కార్యాలయములు, రంపచోడవరం, ఏటపాక, చింతూరు నందు తేదీ. 24-07-2026 వరకు విధులు నిర్వర్తించుటకు ఆసక్తి గల అర్హులైన అభ్యర్ధుల నుండి దరఖాస్తులు కోరుతూ దిగువ తెలిపిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగములకు నోటిఫికేషన్ జారీచేయడమైనది.

వ. నెం.	పోస్టు వివరములు	అల్లూరి సీతారామరాజు జిల్లా ఖాళీలు సంఖ్య	వయస్సు	వేతనము	విద్యా అర్హత/ అనుభవము	రిమార్కులు
1	సీనియర్ అసిస్టెంట్	1	18-42 (18-09-2024 నాటికి)	As per G.O.M.s. No. 7 Finance (HR-I-Pig. & Policy) Department, Dt. 17-01-2022	ఏదైనా డిగ్రీ	అల్లూరు సీతారామరాజు జిల్లాకు చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు
2	వర్క్ ఇన్‌స్పెక్టర్	2			డిప్లొమో ఇన్ సివిల్ ఇంజనీరింగ్/ బి.టెక్ ఇన్ సివిల్ ఇంజనీరింగ్	
3	డేటా ఎంట్రీ ఆపరేటర్	2			బి.సి.ఏ./ యం.సి.ఏ./ బి.టెక్ ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఏదైనా డిగ్రీ (కంప్యూటర్స్)	
4	ఆఫీస్ సబార్డినేట్	1			10వ తరగతి (లేక) దానికి సమానమైన విద్యా అర్హత	
మొత్తం ఖాళీలు		6				

సదరు ఔట్ సోర్సింగ్ పోస్టులకు శ్రీయుత జిల్లా కలెక్టర్, అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు వారు జారీ చేసిన రోస్టర్ పాయింట్స్ ఈ క్రింది విధముగా కలవు.

వ.నెం.	పోస్టు వివరములు	రోస్టర్ పాయింట్స్	రిజర్వేషన్ కేటగిరి
1	సీనియర్ అసిస్టెంట్	7	S.C.
2	వర్క్ ఇన్‌స్పెక్టర్	8	S.C. మహిళా
		9	O.C.
3	డేటా ఎంట్రీ ఆపరేటర్	24	B.C.-B
		25	S.T
4	ఆఫీస్ సబార్డినేట్	17	O.C. మహిళా

కావున, అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను సంబంధిత ధృవపత్రములతో జతచేసి (గెజిటెడ్ అధికారి వారితో అటెస్టెడ్ చేయబడిన విద్యా అర్హత, స్టడీ ధృవపత్రములు, కుల ధృవీకరణ ధృవపత్రము, నివాస ధృవపత్రము, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫోటో ఇతరములు) లను జత చేసి తమ దరఖాస్తులను తేది. 07-04-2025 సాయంత్రం 5.00 గం॥ల లోపు ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, సి.ఆర్.సి., గెస్ట్ హౌస్, ధవళేశ్వరం గ్రామం, రాజమహేంద్రవరం రూరల్ నందు నేరుగా అందచేయవలెను.

ఎంపిక విధానము:

వ.నెం.	పోస్టు వివరములు	ప్రక్రియ
1	సీనియర్ అసిస్టెంట్, వర్క్ ఇన్‌స్పెక్టర్, డేటా ఎంట్రీ ఆపరేటర్	వ్రాత పరీక్ష & ఇంటర్వ్యూ
2	ఆఫీస్ సబార్డినేట్	విద్యార్హతలో మెరిట్ & పని అనుభవము ఆధారముగా

ఎంపిక కాబడిన అభ్యర్థులు ఆర్& ఆర్ కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రంపచోడవరం, చింతూరు మరియు ఏటపాక యూనిట్స్, అల్లూరి సీతారామరాజు జిల్లా నందు పనిచేయవలసి ఉంటుంది.

గమనిక: 1. దరఖాస్తునకు తగిన అర్హత ధృవపత్రములు జతచేయని యెడల వారు దరఖాస్తులను తిరస్కరించబడును మరియు ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు. 2. పై తెలిపిన ఖాళీల సంఖ్య తాత్కాలికమైనవి మరియు డిపార్ట్‌మెంట్ అవసరాన్ని బట్టి పెంచడానికి లేదా తగ్గించడానికి అవకాశం ఉంది. 3. అల్లూరు సీతారామరాజు జిల్లాకు చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

సం/- ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ & ఎక్స్ అఫీసియో జాయింటు కలక్టరు
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిఇఒ

గురుకుల విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఎపి గురుకుల విద్యాలయాల్లో వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని డిఇఒ పి.బ్రహ్మాజీరావు తెలిపారు. గురువారం తన కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. 6, 7, 8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్లు భర్తీకి, జూనియర్ ఇంటర్మీడియట్, డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు http://apr.apcf-ss.in వెబ్‌సైట్‌లో లాగిన్ అయి, ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల 25న రాత పరీక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో తాటిపూడి ఎపిఆర్ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ జెఎస్.సంధ్యా భార్గవి, అసిస్టెంట్ కమిషనర్ (ఎగ్జామినేషన్స్) శశి కుమార్, పిజిటి ప్రతిభా భారతి పాల్గొన్నారు.

చట్టం గురించి అవగాహన కల్పిస్తున్న సిఐ

విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన

ప్రజాశక్తి -హుకుంపేట : సూకూరులోని గిరిజన సంక్షేమ బాలురు పాఠశాలలో 'సంకల్ప' ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం పోక్సో చట్టం, డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే నష్టాలు, పోక్స్ చట్టం గురించి విద్యార్థులకు వివరించారు.విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని, ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. బాల్యం నుంచే క్రమశిక్షణ, మంచి నడవడికలు నేర్చుకోవాలని సూచించారు. కొంతమంది యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలవ్వడమే కాకుండా, వాటి రవాణాలో భాగస్వాములై కేసులు పాలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. చదువుకోవడానికి ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి రెవెన్యూ, సర్వే అధికారులతో రీ సర్వే, ప్రభుత్వ భూముల పరిరక్షణ, మ్యుటేషన్లు, ఆధునిక రికార్డు రూములు ఏర్పాటుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే ప్రక్రియను తాహశీల్దారులు పర్యవేక్షించాలని సూచించారు. భూముల రీ సర్వేకు వారాంతపు లక్ష్యాలను నిర్దేశించాలన్నారు. నెలాఖరు నాటికి 508 గ్రామాలలో రీ సర్వేపూర్తి చేయాలని ఆదేశించారు.. మండల వారీగా ఉన్న ప్రభుత్వ భూములను సర్వే చేయాలన్నారు. మ్యుటేషన్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని, అభ్యంతరకరమైన పోరంబోకు భూములను అక్రమించిన వారికి నోటీసు జారీ చేయాలని తాహశీల్దారులను ఆదేశించారు. భూఆక్రమణలపై తగిన చర్యలు తీసుకోవాలని,ప్రభుత్వ భూములను రక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉందన్నారు. మండలాల వారీగా ఇళ్ల పట్టాల కోసం ఎంత మంది అర్జీలు సమర్పించారో వివరాలు సమర్పించాలన్నారు. అనధికారకంగా ఎంత మంది ప్రభుత్వ భూములను ఆక్రమించారో నివేదించాలన్నారు. రెవెన్యూ రికార్డులను, సర్వే రికార్డులను సక్రమంగా భద్రపరచాలని సూచించారు.. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన ఫిర్యాదులను ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆడిట్ చేసి పరిష్కార చర్యలు చేపట్టాలని స్పష్టం చేసారు. రైతుల రిజిస్ట్రీ చేయాలని సూచించారు. ప్రతీ సోమవారం మండల స్థాయిలో తాహశీల్దార్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ నిర్వహించాలని, మండల స్థాయి అధికారులు గ్రీవెన్సుకు హాజరు కావాలని సూచించారు. చిన్న సమస్యలకు కూడా ప్రజలు జిల్లా కేంద్రానికి వస్తున్నారని, మండల స్థాయిలోనే ఫిర్యాదులు పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు.

జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ మాట్లాడుతూ మండలంలో వస్తున్న రెవెన్యూ ఫిర్యాదులపై సబ్ కలెక్టర్‌తో చర్చించాలన్నారు. తాహశీల్దారు కార్యాలయాల్లో ఆధునిక రికార్డు రూములను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డిఆర్ఒ కె. పద్మలత, సర్వే సహాయసంచాలకులు దేవేంద్రుడు, పర్చువల్గా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, చింతూరు పి. ఓ అపూర్వ భరత్, 22 మండలాల తాహశీల్దారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

బకాయిలపై మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రజాశక్తి- చింతపల్లి : మధ్యాహ్న భోజన కార్మికులకు ధరలకు అనుగుణంగా జీతాలు పెంచడంతోపాటు నాలుగు నెలల వేతన బకాయి చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై చలో విజయవాడ ఆందోళనకు వెళ్లలేనివారంతా మంగళవారం మండల కేంద్రానికి వచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళనకు సంఘీభావం తెలిపినా సిఐటియు జిల్లా.బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఉన్నాయని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలను పెంచాలని, సకాలంలో వేతనాలు, బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు చేసి భోజన నిర్వహణ చేస్తున్నారన్నారు. నెలలు తరబడి జీతాలు, బిల్లులు చెల్లించకపోతే భోజన నిర్వహణ ఎలా సాధ్యమని మండిపడ్డారు. నాలుగు నెలలు జీతాల బకాయితోపాటు నవంబర్, డిసెంబర్., జనవరి. నెలలకు ఒక్కో నెలకు రూ. 3000 ఇవ్వాల్సి ఉండగా. రూ.1000 మాత్రమే ఇచ్చి రూ.2000 వేలు బకాయి పెట్టార, ఫిబ్రవరి నెల జీతం ఇంకా ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో మధ్యాహ్నం భోజనం కార్మికురాలు సంఘం జిల్లా అధ్యక్షులు. పసుపులేటి లక్ష్మి, మండల కార్యదర్శి. ఏసు బాబు. జ్యోతి. వెంకట్రావు మరియు మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ఇవిఎం గొడౌన్ తనిఖీ

ప్రజాశక్తి - పాడేరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఇవిఎం గొడౌన్లను జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ మంగళవారం తనిఖీ చేసారు. అరకువ్యాలీ పాడేరు, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు అరకు వ్యాలీ పార్లమెంటు నియోజక వర్గానికి సంబంధించిన ఇవిఎంలు భద్రపరిచి, సీలు వేసిన గొడౌన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరచి ఇవిఎంలను, వివి ప్యాట్, బ్యాలట్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇవిఎం గొడౌన్ల తనిఖీలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సందర్శించి, ,భద్రతా చర్యలను పరిశీలించారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. పద్మలత, పాడేరు తహశీల్దార్ త్రినాధరావు, డిప్యూటీ తహశీల్దార్లు, టిడిపి, వైసిపి,బిజెపి, ఆప్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - హుకుంపేట: మండలంలోని తాడిపుట్టు, బొడ్డపుట్టు గ్రామాల్లో మంగళవారం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. మలేరియా మాస్ స్క్రీనింగ్ చేశారు. ప్రజలకు ఆరోగ్యంపై తగు సూచనలు చేశారు.సీజన్‌లో మలేరియా జ్వరాలు ప్రబలకుండా ఉండాలంటే ప్రజలంతా దోమ తెరలను వాడాలని సూచించారు. దోమల విజృంభించకుండా ఇంటిపరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అని చూసించారు. వేసవిలో సీజనల్‌లో విషజ్వరాలు, డయేరియా ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మలేరియా, డయేరియా, విషజ్వరాలు ప్రబలినపుడు నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆరోగ్యకేంద్రానికి వచ్చి వైద్యసేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ కె.మహేష్, ఎంఎల్‌హెచ్‌పి కె. ప్రియాంక, కె.మమ్ముట్టి, వి.భానుప్రసాద్, బి. భాస్కర్, యు. శ్రీనుబాబు, టి. వీర్రాజు, ఎన్‌జివి. ప్రసాద్‌పెంపిహెచ్ఎం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రోగ నివారణకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి -హుకుంపేట: పశువులకు రోగ నివారణకు ముందస్తుగా టీకాలు తప్పనిసరి వేయించాలని జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్. నరసింహులు అన్నారు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల ఒకటి నుంచి 31వరకు గాలికుంటు టీకాలు ఉచితంగా వేస్తున్నారని, గ్రామాల్లోని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని సూకూరు పంచాయతీ ములుశోభ గ్రామంలో పశువులు మేకలు గొర్రెలకు గాలికుంటు టీకాలు వేశారు. పాడిపశువులకు బీమా చేయించాలని, ఏదైనా కారణంతో మరణిస్తే పరిహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో హుకుంపేట పశు వైద్యాధికారి డాక్టర్ కె. చరణ్, వెటర్నరీ అసిస్టెంట్ సిహెచ్.ప్రశాంత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మోదమ్మ ఉత్సవాలకు నిధులు మంజూరు చేయండి

పాడేరు : మే నెల 11, 12, 13 తేదీలలో నిర్వహించనున్న పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలను ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని స్థానిక ఎమ్మెల్యే ఆలయ,ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌ను కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. అమ్మవారి పండగకు అన్ని విధాలా సహకరించాలని, ఉత్సవాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రతి ఏటా మాదిరిగా రూ. కోటి కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను ఉత్సవ కమిటీ ప్రతినిధులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటిబాబు నాయుడు, ఉత్సవ ప్రధాన కార్యదర్శులు కూడా సురేష్ కుమార్, ప్రశాంత్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలను వేగవంతం చేయండి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రధానమంత్రి జన్‌మన్ ప్రోగ్రాంలో రూ.1 కోటి 20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ కేంద్రాలను ఐటిడిఎ ఇంచార్జ్ పిఒ, జెసి డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ మంగళవారం పరిశీలించారు. పాడేరు మండలం ముంతమామిడి, రణంబడి గ్రామాల్లో పర్యటించి భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రణంబడి మల్టీపర్పస్ సెంటర్‌ను రెండు నెలల పూర్తి చేయాలని ఆదేశించారు. ముంతమామిడి మల్టీపర్పస్ కేంద్రాన్ని రెండు వారాల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణాలలో పటిష్టమైన నాణ్యతలు పాటించాలని సూచించారు. మల్టీ పర్పస్ కేంద్రాల్లో హెల్త్ సెంటర్, అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యలపై ఆరా తీశారు.కార్యక్రమంలో టిడబ్ల్యు డిఇ రవికుమార్, ఎఇ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న పిఒ అభిషేక్ గౌడ

ఆధార్ ప్రత్యేక కౌంటర్లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : రాజమండ్రి పోస్టల్ డివిజన్ ఆధ్వర్యంలో ఆధార్ మొబైల్ ఫోన్ అనుసంధానం, అప్డేట్ కొరకు ప్రత్యేక కౌంటర్లు అందుబాటులోనికి తీసుకొచ్చామని, వాటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం డివిజన్ పోస్టల్ అధికారి తాతు నాయుడు కోరారు. మారేడుమిల్లి పోస్ట్ ఆఫీస్‌ను మంగళవారం సందర్శించిన ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాజమండ్రి ప్రధాన పోస్టాఫీసుతో పాటుగా దానవాయిపేట, ఆర్యాపురం, శ్రీరామ్‌నగర్, ధవళేశ్వరం, కడియం, ద్వారపూడి, అనపర్తి, మండపేట, రామచంద్రపురం పోస్టాఫీసులు, ఆయా గ్రామాలలోని పలు పోస్టాఫీసులలో వందకు పైగా మొబైల్ అప్డేట్ కౌంటర్లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల నుండి ప్రత్యక్ష నగదు బదిలీలకు, రైతులకు భూ ఆధార్ రిజిస్ట్రీ, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డుల జారీ, ఒకే రేషన్ కార్డు పథకం, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర ఆర్‌టిఓ సేవలు, ఉద్యోగుల ఈపిఎఫ్ సేవలు, ఆదాయపు పన్ను, ఈ ఫైలింగ్, ఇతర ప్రభుత్వ పథకాల కొరకు ఆధార్ మొబైల్ అనుసంధానం, అప్డేట్ అనివార్యమని పేర్కొన్నారు. అంతేకాక పేరు, పుట్టిన తేదీ, లింగ, చిరునామా మార్పులు ఆన్లైన్ ద్వారా స్వయంగా మార్పు చేసుకొనుటకు కూడా ఆధార్ మొబైల్ అనుసంధానం తప్పనిసరి అని పేర్కొన్నారు. కావున ప్రజలందరూ పోస్టాఫీసులో లభించే ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-దేవీపట్నం : రోడ్డుపై రాత్రి సమయంలో గేదెను ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని మంటూరు గ్రామానికి చెందిన పండాల సూర్య ప్రకాష్ రెడ్డి (32) తన స్నేహితుడు చెదల రామిరెడ్డితో కలిసి పెద్ద నూతులు గ్రామం నుండి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం మంటూరు సోమవారం రాత్రి వస్తున్నారు. పోతవరం గ్రామ శివారులో రాత్రి 7.40 గంటల సమయంలో రోడ్డుకు అడ్డంగా అకస్మాత్తుగా ఒక గేదె అడ్డు రావడంతో చీకటి సమయం కావడంతో బైక్ అదుపు తప్పి గేదెను ఢీకొంది. ఈ ప్రమాదంలో సూర్యప్రకాష్‌రెడ్డి తలకు తీవ్ర గాయం కాగా, వెనుక కూర్చున్న అతని మిత్రుడు రామిరెడ్డి చిన్న చిన్న గాయాలతో బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడిన సూర్యప్రకాష్ రెడ్డిని బంధువులు ఆసుపత్రికి తరలించారు. మంగళవారం తెల్లవారుజామున 4.06 గంటలకు పరిస్థితి విషమించి సూర్య ప్రకాష్ రెడ్డి మృతి చెందాడు. ఈ ప్రమాదంపై దేవీపట్నం ఎస్ఐ కె.షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ఎంఎస్‌ఎంఇల సాధికారతపై సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సాధికారత దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం విశాఖపట్నం నోవాటెల్ హోటల్ వేదికగా సిఐఐ సహకారంతో ఎపి ఎంఎస్‌ఎంఇ అభివృద్ధి కార్పొరేషన్, నీతి ఆయోగ్ సంయుక్తంగా 'ఎగుమతి ఆధారిత వృద్ధి - ఆవిష్కరణల కోసం ఎంఎస్‌ఎంఇలను సాధికారపరచడం' అనే అంశంపై ప్రత్యేక సదస్సు జరుగనుంది. ఈ మేరకు స్థానిక అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేస్తూ ఎంఎస్‌ఎంఇ సిఇఒ లేఖ రాశారు. వర్క్‌షాప్‌లో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్‌ఎంఇ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, నీతి ఆయోగ్ సిఇఒ సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ కార్యదర్శి (పరిశ్రమలు, వాణిజ్యం) ఎన్.యువరాజ్, ఇతర ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొనున్నట్లు తెలిపారు. సుమారు 250-300 మంది ఎంఎస్‌ఎంఇ వ్యవస్థాపకులు, ఔత్సాహికులు పాల్గొంటారని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పక్కా ఏర్పాట్లు చేయాలని, సమన్వయ లోపం రాకుండా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

28న తపాలా అదాలత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలను పరిష్కరించే నిమిత్తం ఈ నెల 28న ఉదయం 11 గంటలకు ఎంవిపి బస్ కాంప్లెక్స్ పక్కన ఉన్న పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంలో పోస్టు మాస్టర్ జనరల్ వారిచే 117వ తపాలా అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే ఈ అదాలత్‌లో చర్చించబడతాయని పేర్కొన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు తమ సమస్యలను, ఫిర్యాదులను ఈ నెల 24లోగా '117వ తపాలా అదాలత్' అను శీర్షికతో కెవిడి సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టుమాస్టర్ జనరల్ వారి కార్యాలయం, విశాఖపట్నం-530017' అను చిరునామాకు పంపాలని కోరారు.

అఖిలపక్ష సమావేశంతోనే అధికారుల్లో స్పందన

- ప్రజలకు పూర్తిస్థాయిలో సమాచారమిచ్చి గ్రామసభలు నిర్వహించాలి

- సిపిఎం నాయకులు రాజులు, సంతోష్‌కుమార్

మాట్లాడుతున్న సంతోష్ కుమార్, చిత్రంలో రాజులు తదితరులు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండల కేంద్రంలో ఈనెల 11వ తేదీన జరిగిన అఖిలపక్ష సమావేశంలో నిర్వాసితుల సమస్యలపై మరో ఉద్యమానికి సిద్ధమవ్వాలని మండలంలోని అన్ని రాజకీయ పక్షాలు ఒక్కటిగా తీసుకున్న నిర్ణయం వలనే ప్రభుత్వ అధికారులు స్పందించారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ అన్నారు. ఇందులో భాగంగా మండలం తహశీల్దార్ కార్యాలయం వద్ద చింతూరు ఐటిడిఎ పిఒ సదస్సు ఏర్పాటు చేసి ప్రేయారిటీ గ్రామాల పిడిఎఫ్ సమస్యలను పరిష్కరించడం, దరఖాస్తులు స్వీకరించడాన్ని సిపిఎం స్వాగతిస్తుందని పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కొరకు హడావుడి సభలు కాకుండా పూర్తి స్థాయిలో ప్రజలకు సమాచారం తెలియజేసి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని, ఆయా గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా సమస్యలు పరిష్కరించాలని కోరారు. నిర్వాసితులు ఐక్యంగా ఉద్యమిస్తే తప్ప పూర్తి న్యాయం జరగదన్నారు. 41.15 కాంటూర్ నిర్వాసిత గ్రామాల పునరావాస కాలనీలను సత్వరమే పూర్తి చేయాలని, కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, మంచినీరు వంటి మౌలిక సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అక్కడక్కడ డి-పారం పట్టా, కొండపోడు భూములకు పరిహారం రాలేదని, వాటి కూడా పరిహారం ఇప్పించే ఏర్పాటు చేయాలని, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు పరిహారం, పునరావాసం కల్పించేందుకు పునరాలోచన చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామమూర్తి, కదల కొండయ్యరెడ్డి, సీరపు తాతబాబు, కుంజ కన్నయ్య, ఖాదర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ ప్రారంభమెప్పుడు ?

- వసూలు చేసిన సొమ్ము ఏమైందో తెలియని వైనం

- సమాధానం చెప్పే వారే కరువు

ప్రజాశక్తి-అడ్డతీగల

మండల కేంద్రంలో డ్వాక్రా సంఘాల ద్వారా మహిళా మార్ట్ ఏర్పాటు చేస్తామని మూడేళ్ల క్రితం డబ్బులు వసూలు చేసినా నేటికీ మహిళా మార్ట్ ప్రారంభం కాలేదు. మహిళా మార్ట్ ఏర్పాటుకు మండలంలోని ఒక్కో డ్వాక్రా సంఘం నుండి రూ.3వేలు చొప్పున సుమారుగా 1,038 డ్వాక్రా సంఘాల నుండి మూడు సంవత్సరాల క్రితం రూ.31.14లక్షలు వసూలు చేశారు. కాని నేటికీ మహిళా మార్ట్ ఏర్పాటు కాలేదు. వసూలు చేసిన డబ్బులు ఏమి చేశారో ఎవరికి తెలియని పరిస్థితి. ఈ సొమ్ములు కోసం ఎవరైనా ప్రశ్నిస్తే ఆ సంఘాల వారికి ప్రభుత్వం నుండి వచ్చే ఏ పథకం కూడా వర్తించకుండా చేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు కొన్ని సంఘాల సభ్యులు చెబుతున్నారు. ఈ వసూలు చేసిన సొమ్ము అధికారికంగా ఉందా? లేక ఎవరు జేబుల్లోకైనా వెళ్లిపోయిందా? అన్న ప్రశ్నలు వేలకొద్దీ వస్తున్నాయి. ఈ సొమ్ము కోసం ఎవరిని అడిగినా అదిగో వస్తుంది ఇదిగో వస్తుందని కథలు చెబుతున్నారు తప్ప మహిళా మార్ట్ ప్రారంభించే ఆలోచన లేనట్టుగా వీరి వ్యవహారం ఉందని డ్వాక్రా మహిళలు అంటున్నారు. అసలు ఈ సొమ్ము ఎక్కడ ఉంది? ఏం చేశారు? ఎవరికీ తెలియకుండా ఎందుకు ఉంచారు? అనే ప్రశ్నలకు జవాబు చెప్పేవారే కొరువయ్యారు. ఎవరైనా డ్వాక్రా సంఘాల నాయకుల భర్తలు వెళ్లి అడిగితే మీకు ఆ సొమ్ముకు సంబంధం లేదు మీ ఆడవాళ్లను వచ్చి అడగమనండి అంటూ సమాధానం చెబుతున్నారని మరికొందరు వాపోతున్నారు. డ్వాక్రా మహిళలు అప్పు తీసుకుంటే వడ్డీతో సహా వసూలు చేసే అధికారులు ఈ మొత్తం సొమ్ముకు వడ్డీతో సహా ఇవ్వాలని సంఘ సభ్యులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారి వివరణ కోసం ఆఫీసుకు వెళ్లినా ఆయన కనిపించడం లేదని, ఫోన్ చేసినా వారి ఫోన్ పని చేయడం లేదని వాపోతున్నారు. కావున ఉన్నత స్థాయి అధికారులు దీనిపై దృష్టి సారించి ఈ వ్యవహారంపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిపిపి పేరిట వైద్య విద్య, వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు పూనుకోవడం దారుణమని, తక్షణమే ఆ ప్రక్రియను నిలిపివేయాలని అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. వివిధ సంస్థల ప్రతినిధులు హాజరై ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో ప్రమాదకరమైన పిపిపి విధానాన్ని అమలు చేయడానికి సిద్ధమవడం దుర్మార్గమన్నారు. ఈ విధానం ద్వారా ప్రభుత్వ వైద్య కళాశాలలు, అనుబంధ ఆసుపత్రులు ప్రైవేట్ సంస్థల ఆధీనంలోకి వెళ్తాయని తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రారంభించిన సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని విమర్శిస్తూనే, అదే విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని వక్తలంతా మండిపడ్డారు.

నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఉపాధి హామీ పనులు కల్పించాలి

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ ప్రజలు స్థానికంగా ఎటువంటి కూలి పనుల్లేక ఇరుగుపొరుగు రాష్ట్రాలకు వలస పోతున్నారని, ప్రభుత్వం తక్షణమే వారికి ఉపాధి హామీ పనులు కల్పించాలని పీసా కమిటీ కార్యదర్శి కేలేబు శేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గ్రామానికి చెందిన కూలీలు రహదారిపై పనిముట్లు ఉంచి నిరసన తెలిపారు. ఉపాధి పనులు కల్పించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో కూలి పనులు లేక కుటుంబాల జీవనం గడవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనులు కల్పించకపోవడంతో కుటుంబాల పోషణ కోసం వలసలు వెళ్లవలసిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. ఎంపీడీవో, ఎన్‌ఆర్‌ఇజిఎస్ అధికారులు తక్షణమే స్పందించి దుప్పిలివాడ పంచాయతీ ప్రజలకు ఉపాధి హామీ చట్టం కింద పనులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

పరీక్షా కేంద్రంలో సిసి కెమెరాలు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్షా కేంద్రంలో అధికారులు ఆదేశాల మేరకు మంగళవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ పి.నాగేశ్వరరావు, డిపార్ట్మెంట్ల అధికారి సోమరాజు వెల్లడించారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ పరీక్షా కేంద్రంలో మాస్ కాపీంగ్‌కు ఎటువంటి ఆస్కారం లేకుండా ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిందని, వీటి పర్యవేక్షణ అల్లూరి జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పీవో కార్యాలయాల్లో ఉంటుందని పేర్కొన్నారు. సీలేరు పరీక్షా కేంద్రం ప్రధాన ద్వారం ముందు ఒకటి, విద్యార్థుల పరీక్షలు రాసే ఏడు రూముల్లో ఏడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అల్లూరి జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలే కాకుండా జిల్లాలోని 71 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో పరీక్షలు పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, చుట్టుపక్కల ఇతరులు ఎవరు సంచరించరాదని సూచించారు.

గంట వ్యవధిలో రెండు పశువులు మృత్యువాత

- విషతుల్య ఆహారమే కారణం : పశువైద్యాధికారి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని ఉర్లాకులపాడు గ్రామంలో గంట వ్యవధిలోనే రెండు పశువులు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన కోసూరి రాజుబాబుకు చెందిన రెండు ఆవులు గంట వ్యవధిలోనే అనారోగ్యానికి గురై మెడ వంకర పోతూ, నోటి నుంచి సొంగలు కారుస్తూ ఆకస్మికంగా మృతి చెందాయి. ఆవులు చనిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతు రాజుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో కూడా ఇలాగే పశువులు చనిపోతున్నాయని, సంబంధిత అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని పరువులు గిరిజన రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక పశు వైద్యాధికారి తరుణ్‌ను వివరణ కోరగా ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల్లో దాదాపు రోగనిరోధక టీకాలు పశువులకు వేయడం జరిగిందని తెలిపారు. రైతులు పశువులను విచ్చలవిడిగా వదిలివేయడంతో విషతుల్యమైన ఆహారం తినడం వల్ల ఈ రకంగా మృత్యువాత పడుతున్నాయని చెప్పారు. రైతులు తక్షణమే పశుబీమా చేయించుకోవాలని, తమ పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.